

డీసీఎం, బైక్ ఢీకొని యువకుడి మృతి

కోయిలకొండ, జనవరి 9 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం రాంపూర్ స్టేజీ సమీపంలో బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయభాస్కర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన ఆకాష్(22) స్నేహితునితో కలిసి సోమవారం బైక్‌పై జిల్లా కేంద్రానికి వచ్చారు. రాత్రి కావడంతో జిల్లా కేంద్రంలోనే రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం గ్రామానికి బయలుదేరారు. రాంపూర్ స్టేజీ దగ్గర అతివేగంగా వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొనడంతో ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిత్రుడు నవీన్‌యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆకాష్ తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

విద్య, వైద్యంపైనే.. ప్రధాన దృష్టి



సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనరసింహ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

- జిల్లా ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- జాతీయ రహదారిపై 30 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి చొరవ
- త్వరలో ప్రతీ అసెంబ్లీకి రూ.10 కోట్లు

మహబూబ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు జిల్లాను రాష్ట్రానికే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశనం చేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన పనులు, ఇతర ప్రగతిపై సీఎం ఎమ్మెల్యేలతో చర్చించారు. పలువురు ఎమ్మెల్యేలు తెలిపిన ప్రకారం.. ఉమ్మడి జిల్లాలో విద్య, వైద్య రంగాల పనులు ప్రథమ ప్రాధాన్యంతో చేపట్టాలని సీఎం సూచించారు. ఇటీవల బాలానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసిన సీఎం జాతీయ రహదారిపై ప్రమాదాల నిరోధానికి అవసరమైన ప్రత్యేక కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్న ప్రకారం జాతీయ రహదారిపై ప్రతీ 30 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్‌కు చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు. బాలానగర్, జడ్చర్ల, జానంపేటతో పాటు అలంపూర్ వరకు మరో రెండు చోట్ల ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించేందుకు అధికారులకు ఆదేశాలిస్తామని వెల్లడించారని తెలిపారు. పూర్వపు జిల్లా కేంద్రమైన మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థ, నాలెడ్జి సెంటర్, ఇంజనీరింగ్ కాలేజీ, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరగా, సీఎం అంగీకరించారని తెలిపారు. అదేవిధంగా జడ్చర్లలో గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు ఎమ్మెల్యే అనిరుధ్ కోరారు. మొత్తం నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, పునరుద్ధరణ, మరమ్మతులపై ప్రతిపాదనలను తయారు చేసి నివేదిస్తే, సంబంధిత శాఖ ద్వారా నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ రోడ్ల మరమ్మతులపై ప్రతిపాదనలు రూపొందించేందుకు అధికారులకు సూచించాలని చెప్పారు. దేవరకద్ర నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీల ఏర్పాటుపై ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరగా, ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, శ్రీహరి, రాజేశ్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి తమ తమ నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యాసంస్థల ఏర్పాటు, సాగునీటి అంశాలపై ప్రస్తావించగా, అన్నింటిపైనా సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి.. ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తే పనుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. ప్రతీ నియోజకవర్గానికి త్వరలో రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు.

ప్రజల్లోకి చొచ్చుకెళ్లాలని సూచన

పాలమూరు అభివృద్ధే ఏకైక లక్ష్యంగా ఎమ్మెల్యేలంతా జనంలోనే ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారని తెలిసింది. ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో పని చేసుకోవాలని చెప్పారని సమాచారం. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రెండు సీట్లను గెలవడమే లక్ష్యంగా క్యాడర్‌ను సమాయత్తం చేయాలని స్పష్టంగా ఆదేశించారని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిర్ణేశిస్తే వారి గెలుపే అందరి లక్ష్యం కావాలని సూచించినట్లు చెబుతున్నారు. అధికారులు, ఉద్యోగులతో సమన్వయంతో వ్యవహరించి నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించాలని.. ప్రజలకు సేవలందించాలని సీఎం రేవంత్ జిల్లా ఎమ్మెల్యేలకు మార్గనిర్దేశనం చేశారని సమాచారం. అధికారులు, ఉద్యోగులు, పోలీసుల నియామకాల విషయంలో బంధుప్రీతికి, అనుచరులు, స్నేహితుల ఒత్తిళ్లకు లొంగవద్దని, సిన్సియర్‌గా పనిచేసే వారికే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించినట్లు తెలిసింది.

పదవులపై.. ఆశలు


చిన్నారెడ్డి
సంపత్ కుమార్
మల్లు రవి
మందా జగన్నాథ్
శివసేనా రెడ్డి

- సీఎం రేవంత్ ప్రకటనతో చిన్నారెడ్డి వర్గంలో జోష్
- ఎమ్మెల్సీ పదవి కేటాయిస్తారంటున్న పార్టీ నేతలు
- పరిశీలనలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు
- ఎంపీ టిక్కెట్ కోసం బలమైన అభ్యర్థిగా మల్లు రవి
- నామినేటెడ్ పదవుల కోసం భారీగా ఆశావహులు

వనపర్తి/గద్వాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది, అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తవుతోంది. గత ఎన్నికల్లో టికెట్లు ఆశించిన వారు.. గెలుపు గుర్రాల కోసం టికెట్లను వదులుకున్న వారికి ఏదో ఒక పదవి కేటాయించాల్సిన సమయం ఆసన్నమైంది. నిర్ణీత సమయంలో పదవుల కేటాయింపులు పూర్తి చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికలను నాయకులు సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన ఏబీఎన్ బిగ్ డిబేట్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్సీలతో పాటు నామినేటెడ్ పదవులపైన తన స్పష్టమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. జనవరి చివరిలోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. గత ఎన్నికల్లో టికెట్లు దక్కని సీనియర్ నాయకులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో ముఖ్యంగా మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి పేరును ఆయన ప్రస్తావించారు. గత ఎన్నికల్లో చిన్నారెడ్డికి రెండో జాబితాలో టికెట్ ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా మూడో జాబితాలో ఆయన స్థానంలో ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి టికెట్ కేటాయించింది. దీంతో అలకబూనిన చిన్నారెడ్డిని రేవంత్‌రెడ్డితోపాటు.. కర్ణాటక మంత్రి బోసురాజు కూడా బుజ్జగించారు. ఇక అప్పటి నుంచి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేగా మేఘారెడ్డిని గెలిపిస్తే.. చిన్నారెడ్డికి ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని, తద్వారా ఆయనకు కేబినెట్‌లో మంత్రిగా అవకాశం లభిస్తుందని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. అనుకున్నట్లుగానే వనపర్తి ఎమ్మెల్యేగా తూడి మేఘారెడ్డి ఘన విజయం సాధించారు. అలాగే గత ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి.. ఎమ్మెల్యేలుగా గెలిచిన తర్వాత ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. దాంతో ఇప్పుడు ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అలాగే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలిచి.. ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానం కూడా ఖాళీగా ఉంది. అయితే ప్రస్తుతం స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు బలం లేనందున.. ఇప్పుడప్పుడే ఈ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. కానీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు మాత్రం జనవరి 29న నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఈ రెండు స్థానాల కోసం కాంగ్రెస్ పార్టీలో పోటీ నెలకొంది. ఒకటి మైనారిటీలకు ఇస్తామని ఏబీఎన్ బిగ్ డిబేట్‌లో రేవంత్‌రెడ్డి తెలుపగా.. రెండోది చిన్నారెడ్డికే దక్కుతుందనే చర్చ జరుగుతోంది.

కలిసొచ్చిన ఈసీ నిబంధన..

కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఈసీ ఇచ్చిన నిబంధన కలిసొచ్చిందని చెప్పొచ్చు. పాత పద్ధతిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా పార్టీల బలబలాల ఆధారంగా ఎమ్మెల్సీలను ఎన్నుకోవాల్సి ఉండేది. కానీ ఇప్పుడు రెండు స్థానాలకు మొత్తం ఎమ్మెల్యేలు ఓటు వేసే అవకాశం కల్పించారు. దాంతో అసెంబ్లీలో కాంగ్రెస్, దాని మిత్రపక్షం సీపీఐకి కలిపి 65 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో మెజారిటీ ప్రకారం రెండు స్థానాలను గెలుచుకోవచ్చు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా గత ప్రభుత్వం నామినేట్ చేసిన దాసోజు శ్రావణ్, కుర్ర సత్యనారాయణలను గవర్నర్ ఎంపిక చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వారికి అవకాశం ఉండదు. ఎమ్మెల్యే కోటాతోపాటు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక జరిగితే టీజేఎస్ చైర్మన్ కోదండరాంను ఆ కోటాలో అకామిడేట్ చేసి, ఎమ్మెల్యే కోటా స్థానాల్లో ఒకటి మైనారిటీలకు ఇస్తే.. మరొకటి ఉమ్మడి పాలమూరు జిల్లాకే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉండటంతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ వదులుకున్నారు. దీంతో ఆయన పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. అలాగే మరో ఏఐసీసీ కార్యదర్శి, గత ఎన్నికల్లో అలంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందిన సంపత్‌కుమార్ పేరు కూడా ప్రధానంగా పరిశీలనలో ఉంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ తిరిగి గెలుచుకుంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పట్టు నిలుపుకోవాలన్నా.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లు దక్కించుకోవాలన్నా ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి పవర్ సెంటర్ అవసరమనే భావన ఉంది. అందుకే సంపత్‌కుమార్ ఎమ్మెల్సీ పదవికి బలమైన అభ్యర్థిగా నిలవనున్నారు. ఒకవేళ సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోతే.. పార్టీలో అత్యంత కీలకమైన పదవి వచ్చే అవకాశం ఉంది.



ఎంపీ బరిలో మల్లు రవి..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా నాగర్‌కర్నూల్ స్థానం ఉంది. ఇక్కడి నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1991-1996, 1998-1999 మధ్యలో ఆయన ఈ స్థానం నుంచి గెలిచారు. ఒకసారి ఉప ఎన్నికల్లో జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత మళ్లీ గెలవలేదు. 2009, 2014లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ ఓటమి చెందారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేసినప్పటికీ రెండో స్థానంలో నిలిచారు. అయితే ఈసారి కూడా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి పోటీ చేయడం కోసం ఆయన అసెంబ్లీకి పోటీ చేయలేదు. అలాగే ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు కోసం మల్లు రవి విస్తృతంగా పర్యటించారు. గెలుపు గుర్రాలకు టికెట్లు ఇప్పించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయనను ఇక్కడి నుంచే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించేందుకు పార్టీ ఆలోచిస్తోంది. అలాగే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్‌కుమార్ కూడా ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీ ఎన్నికల్లోపు ఎమ్మెల్సీ లేదా ఇతర ప్రాధాన్య పోస్టులో సంపత్‌ను భర్తీ చేయలేకపోతే ఆయన కూడా బలమైన పోటీదారుగా మారే అవకాశం కనిపిస్తోంది. వీరితో పాటు మాజీ ఎంపీ మందా జగన్నాథ్ కూడా ఈ స్థానం నుంచి టికెట్ కోరుతున్నట్లుగా సమాచారం. ఆయన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌ను వీడి, తన ఢిల్లీ అధికార ప్రతినిధి పోస్టుకు రాజీనామా చేసి మరీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో ఎంపీగా నాలుగుసార్లు విజయం సాధించారు. తను ఈ నియోజకవర్గానికి సుపరిచితుడిగా ఉన్నారు. అలాగే జనవరి 31లోపు నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో వాటిపైనా చాలామంది ఆశలు పెట్టుకున్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించినా వారికి దక్కలేదు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరూ నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు.



జోగుళాంబ ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి సహకారం

- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ భగేల్

అలంపూర్ చౌరస్తా, జనవరి 9: అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన ఐదో శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ భగేల్ అన్నారు. మంగళవారం ఆయన ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయన పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట స్వామివారి సన్నిధిలో, తర్వాత అమ్మవారి సన్నిధిలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలు ఇచ్చి, ఆశీర్వాదం అందించారు. ఆలయ చైర్మన్ శేష వస్త్రాలతో పాటు, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ విశిష్టతలను అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ వివరించారు. అనంతరం సత్యపాల్ సింగ్ భగేల్ విలేకరులతో మాట్లాడారు. ఆలయాల అభివృద్ధిపై ఇక్కడి పాలక మండలి, అధికారులు డీపీఆర్ అందజేస్తే సంబంధిత శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు అతి తక్కువ వేతనానికే పని చేస్తున్నారని, వారంటే తనకు ఎనలేని గౌరవమన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు, వేతన పెంపునకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, సీఐ రాజు, తహసీల్దార్ మంజుల, ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఆలయ ఈవో పురేందర్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, మానవపాడు మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జనరల్ సెక్రటరీ గుజ్జుల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీచుపల్లిలో పూజలు

ఎర్రవల్లి: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎస్పీ సింగ్ భగేల్ మంగళవారం పూజలు చేశారు. ఆయనకు ప్రధాన అర్చకుడు మారుతీచారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రికి శేషవస్త్రాలను అందించారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోస్గి రూరల్, జనవరి 9: కోస్గి పట్టణంలోని పలు పాన్ షాప్‌లు, హోటళ్లలో సాగుతున్న హుక్కా దందాపై 'దమ్ మారో దమ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ నరసింహారెడ్డి మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుక్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడా కనిపించకూడదన్నారు. ఎవరి వద్ద దొరికినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోస్గి పట్టణంలో హుక్కా దందా నడుస్తుందన్న వార్తలు రావడం బాధాకరమన్నారు. నేటి నుంచి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, హుక్కా దందాను కట్టడి చేయాలన్నారు. గంజాయి, హుక్కాపై రోజూ తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడ తనిఖీలు చేయాలో తనకు సమాచారం ఇవ్వాలన్నారు.

అప్రమత్తమైన సివిల్ పోలీసులు

హుక్కా దందాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక సివిల్ పోలీసు అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు. సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీనివాస్‌లు, ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ భరత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, హుక్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలను కట్టడి చేద్దామని చెప్పారు. నేటి నుంచి తనిఖీలు చేయాలని నిర్ణయించారు.

ప్రతీసారి అంతే

- వనపర్తి జడ్పీ సమావేశంలో అన్ని శాఖలపై చర్చ కరువు
- మంగళవారం నిర్వహించిన సమావేశంలోనూ అంతే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు అనేకసార్లు జడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. అయితే ప్రతీసారి టేబుల్ టాప్‌లో ఉన్న శాఖల వరకే చర్చ పరిమితం అవుతోంది. సర్వసభ్య సమావేశం ఎజెండాలో మొత్తం 45 శాఖలను చేర్చగా.. ప్రతీసారి 10 నుంచి 15 శాఖలకు సంబంధించిన ఇబ్బందులపైనే చర్చ జరుగుతుండటం గమనార్హం. దీంతో ఆయా శాఖల పనితీరు.. అందులో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంబంధించి సభ్యులు ప్రశ్నించలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ మీటింగ్ హాల్‌లో మంగళవారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మెజారిటీ శాఖలపై చర్చ జరగలేదు. సాధారణంగా జడ్పీ సర్వసభ్య సమావేశం తేదీ నిర్ణయమైన వెంటనే అయాశాఖల ప్రగతి నివేదికను తీసుకుని.. వాటిని ఎజెండాలో చేర్చిన తర్వాత సభ్యులకు ముందస్తుగా పంపిణీ చేయాలి. ఎజెండా అంశాలను ముందుగానే చదువుకుని సభ్యులు వస్తే.. వాటికి సంబంధించి ప్రశ్నలను వేయవచ్చు. కానీ చాలాసార్లు జడ్పీ సమావేశానికి వచ్చిన తర్వాత ఎజెండా కాపీలు ఇస్తుండటంతో.. ఆయా శాఖల అధికారులు ముందుగా వారి ప్రగతి నివేదికను చదివి వినిపించినా తర్వాత జవాబులు చెప్పాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీనివల్ల నివేదిక చదవడానికే సమయం సరిపోతుండటం వల్ల టేబుల్‌లో ఉన్న అన్ని శాఖలపై చర్చ జరగడం లేదు. గ్రామీణాభివృద్ధి శాఖపై చర్చ సందర్భంగా సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు, మీ సేవా సెంటర్లలో స్లాట్ ఇచ్చిన రోజు సైట్ రెండు నిమిషాల్లోనే క్లోజ్ చేస్తుండటంపై చర్చించారు. దీనికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బదులిస్తూ.. సదరం స్లాట్ల సమస్యలపై డాక్టర్లు, అధికారులతో కలిపి కో ఆర్డినేషన్ మీటింగ్ పెడతామని హామీ ఇచ్చారు. అలాగే వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణ కమీషన్‌కు సంబంధించి.. ఖర్చుల కిందనే 45శాతం తీసేస్తున్నారని, 50శాతం స్త్రీ నిధికి జమచేస్తున్నారని, కానీ ఖర్చు వివరాలు, నిర్దేశిత ఫార్మాట్ లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా.. కో ఆర్డినేషన్ మీటింగ్‌లో చర్చించి.. సమస్యను పరిష్కారిస్తామని అన్నారు. ఈ సమయంలో జడ్పీ కో అప్షన్ సభ్యుడు ఉస్మాన్ తన హక్కులను కాలరాస్తున్నారని పోడియం ఎదురుగా భైఠాయించి నిరసన తెలిపారు. అలాగే కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా వస్తున్న లబ్ధిని స్థానిక డిమాండ్ ప్రకారం వినియోగించాలని అధికారులకు సభ్యులు సూచించారు. విద్యాశాఖపై చర్చ సందర్భంగా రేవల్లి కేజీబీవీలో బోరు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కారణంగా కొత్త భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదని, త్వరితగతిన సమస్య పరిష్కరించాలని రేవల్లి జడ్పీటీసీ సభ్యుడు భీమన్న కోరారు. మన ఊరు- మన బడి పనుల్లో పెండింగ్ వర్క్స్ ఉండటం వల్ల ఉన్న వస్తువులు చోరీకి గురవుతున్నాయని, అలాగే బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని సభ్యులు తెలిపారు. చిన్నంబావి కేజీబీవీలో సపోర్ట్ స్టాఫ్ లేరని, వారిని భర్తీ చేయాలని చిన్నంబావి జడ్పీటీసీ సభ్యురాలు సోమేశ్వరమ్మ తెలిపారు. అలాగే వీపనగండ్ల, రేవల్లి కేజీబీవీలను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఈడబ్ల్యూఐడీసీ అధికారులు సమావేశానికి రాకపోవడంతో.. కలెక్టర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌ను తమ వాటా ప్రకారం ఇస్తే.. పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖపై చర్చ సందర్భంగా రేవల్లి సీహెచ్‌సీల్లో వసతులు లేవని, ఫ్యాన్లు, సీలింగ్ ఊడిపోతున్నాయని, అలాగే రెన్యువల్ చేసిన మార్చురీకి స్టాఫ్ లేకపోవడంతో ప్రారంభించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు ఉన్న అంబులెన్స్ లోకేషన్ షిఫ్ట్ చేశారని, తమకు అత్యంత అవసరం ఉన్న నేపథ్యంలో అంబులెన్స్ కేటాయించాలని అక్కడి సభ్యులు కోరారు. అలాగే వీపనగండ్ల, ఖిల్లాఘణపురం సీహెచ్‌సీల్లో 35 బెడ్లు ఉన్నా.. అందుకు అనుగుణంగా నియామకాలు లేవని సభ్యులు తెలిపారు. వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా రైతుబంధు వస్తుందా? రాదా అని సభ్యులు ప్రశ్నించగా.. ఇప్పటి వరకు 66,185 మందికి రూ. 18 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. అలాగే సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రైతుబంధు వస్తుందని, ఆరు గ్యారెంటీలు కూడా అమలవుతాయని, వందరోజుల సమయం కోరినందున ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. లీడ్ బ్యాంకుపై చర్చ సందర్భంగా ప్రాధాన్యరంగమైన వ్యవసాయానికి రుణాలు ఇవ్వడం లేదని సభ్యులు ప్రశ్నించగా.. సెప్టెంబరు వరకు 23.39 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని, డిసెంబరు వరకు అది అంచనాగా 45శాతానికి చేరి ఉండవచ్చని లీడ్ బ్యాంకు మేనేజర్ అముల్ పవార్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయరంగానికి సంబంధించి 100 శాతం లక్ష్యం చేరుకోవాలని ఆదేశించినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటితోపాటు గిరిజన సంక్షేమ శాఖ, అటవీశాఖ, పశుసంవర్థక శాఖ, ఉద్యాన శాఖ, విద్యుత్ శాఖలపై చర్చ జరిగింది. పలు శాఖలపై చర్చించిన అనంతరం లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జడ్పీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

బిజినేపల్లి, జనవరి 9 : వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఉమ్మడి మహబూబ్‌నగర్ వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,602 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,806 బాలురు, 2,795 మంది బాలికలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 26 మంది పర్యవేక్షకులు, 26 మంది కేంద్ర పరిశీలకులను నియామకం చేసి వీరందరికీ ఈనెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, జనవరి 9 : బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం వెంకటయ్య చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్య 16రోజుల క్రితం పెద్దకొత్తపల్లి నుంచి దేవునితిర్మలాపూర్‌కు తన బైకుపై వస్తుండగా గ్రామ శివారులో బైకు అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన వెంకటయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దేవునితిర్మలాపూర్ గ్రామంలో మంగళవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆధార్ కేంద్రానికి బారులు

మన్ననూర్, జనవరి 9 : ఐటీడీఏ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు రైతువేదికలో నిర్వహిస్తున్న జన్‌మన్ ఆధార్ కేంద్రానికి నల్లమల లోతట్టు ప్రాంతంలోని పెంటలు, ఇతర గ్రామాల నుంచి చెంచులు ఆధార్ నమోదుకు భారీగా తరలివస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే దాదాపు 300 మంది ఆధార్ నమోదు చేసుకున్నారు. చాలామంది చెంచులకు ఆధార్‌కార్డులు లేకపోగా, కొత్తగా రేషన్‌కార్డులు దరఖాస్తులు చేసుకోవాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి అవసరం ఉండడంతో చెంచులు ఆధార్ నమోదుపై ఆసక్తి కనబరుస్తున్నారు. జనమన్ పథకంలో ప్రతి చెంచుకు ఆధార్‌కార్డు ఇవ్వాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించడంతో ఐటీడీఏ పరిధిలోని పదర, అమ్రాబాద్, లింగాల, బల్మూరు, కొల్లాపూర్ మండలాల్లో అధికారులు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజుకు 50 మాత్రమే ఆధార్ నమోదు అవుతుండగా ఇంకా చాలామంది చెంచులు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉంది. చెంచుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇద్దరు ఆపరేటర్లతో ఆధార్ నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరిన్ని రోజులు ఆధార్ కేంద్రాలను కొనసాగించాలని నల్లమల చెంచులు కోరుతున్నారు. ఆధార్ కేంద్రంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మయ్య, ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది అయోధ్యలు చెంచులకు సహకారాన్ని అందిస్తున్నారు.

పీజీ సెంటర్‌లో పర్యావరణ, వాతావరణ బాధ్యతపై సెమినార్

కొల్లాపూర్, జనవరి 9 : పాలమూరు యూనివర్సిటీ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో సోషల్‌వర్క్ విభాగం, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రీవాల్యుయేషన్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా 'పర్యావరణ, వాతావరణ బాధ్యత అవశ్యకత' అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కే.పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, పర్యావరణ అనుకూల జీవనశైలి గురించి వివరించారు. పర్యావరణ శాస్త్రజ్ఞుడు టి.ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణ చర్య మానవ సమాజానికి అత్యంత ప్రాధాన్యత కర్తవ్యమని పేర్కొన్నారు. సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియత్, కన్వీనర్ దేవరాజు, సోషల్ వర్క్ విభాగం సిబ్బంది, విద్యార్థులకు ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.గిరిజామంగతయార్‌లు అభినందించారు.

జీటీ నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 9 : కొత్తకోటలో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న జీటీ నారాయణ యాజమాన్యం, ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి, గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు పలు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం మహబూబ్‌నగర్‌లో డీఎస్పీ మహేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇక్కడ బోగస్ బోనఫైడ్ దందా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలతో ఈ యాజమాన్యాలకు చెందిన రాఘవేంద్ర, శ్రీను, కొత్తకోట మండల విద్యాశాఖాధికారి కృష్ణయ్యలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా బాధ్యులు రాము, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నాయకులు రాథోడ్, బీసీ విద్యార్థి దోమ వెంకటేష్, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ నాయకులు భరత్, గోర్‌బంజారా విద్యార్థి సంఘం నాయకుడు మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

అయిల్‌పామ్ తోటలో అంతర పంటగా ఆముదం సాగు

- భారతీయ నూనెగింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ లావణ్య



జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ శివారులో ఆయిల్‌పాం తోటలో అంతరపంటగా సాగుచేసిన ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

జడ్చర్ల, జనవరి 9 : ఆముదం పంట సాగుతో లాభం చేకూరుతుందని భారతీయ నూనెగింజల పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ లావణ్య సూచించారు. జడ్చర్ల మండలం గంగాపురం శివారులో పామ్‌ఆయిల్ సాగులో అంతరపంటగా ఆముదం పంట సాగు చేసిన వ్యవసాయక్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యాసంగిలో ఇతర పంటలసాగుతో పోల్చితే ఆముదం సాగుకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. ఆముదం పంటను లాభసాటిగా సాగు చేసేతీరు, అనువైన రకాలు, సంకరాలు, ఆముదం ఉపయో గాలు, మార్కెటింగ్ సదుపాయం అందుబాటులో ఉన్న అధికదిగుబడిచ్చే సంకరాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సురేశ్, డాక్టర్ ఎం.మల్లారెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌భూషణ్, డాక్టర్ సదయ్య, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ దివ్యారాణి, జడ్చర్ల మండల వ్యవసాయశాఖ అధికారి గోపీనాథ్, ఏఈఓలు గౌస్‌పాషా, నర్సిములు, మహేష్, భవానీ, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

- కౌన్సిలర్‌లను కొనడం ఎందుకు ? మేమే ఇస్తాం

- కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటిందని, ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు ఆగిపోయాయని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తన మీద కోపంతో అభివృద్ధి పనులు ఆపవద్దని, ఆనాడే చెప్పానని, అయినా పనులన్నీ ఆపేశారన్నారు. మాకన్నా రెండింతల పనులు ఎక్కువగా చేయాలే తప్ప, ఆపడం ఎందుకని ప్రశ్నించారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రితో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, దీని వల్ల ప్రైవేట్ ఆసుపత్రులకు ఎలాంటి నష్టం వాటిల్లదని, పనులు పూర్తిచేస్తే పేదలకు ఎంతో ఉపయోగపడతుందన్నారు. కౌన్సిలర్‌ను కొనాలనే ప్రయత్నాలు చేస్తున్నారని, సంతలో కొన్నట్లు కొనడం ఎందుకని మాకు అధికారమే కావాలంటే గంపగుత్తగా మేమే అప్పగిస్తామని, కనీసం పనులు చేయండని సూచించారు. పెళ్లిళ్లు చేసుకున్న వారికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని, కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఎవరికైనా బంగారం ఇచ్చారా ? మనం మంజూరుచేసిన చెక్కులనే పంచుతున్నారని విమర్శించారు.

ఆశీర్వదిస్తే మళ్లీ ఎంపీగా : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంతో అభివృద్ధి చేసినా ఈర్ష్య, ద్వేషాల కారణంగా పెద్దఎత్తున అభివృద్ధి చేసిన శ్రీనివాస్‌గౌడ్ ఓటమిపాలయ్యారన్నారు. పట్టణాలకు, పల్లెలకు తేడా లేకుండా అభివృద్ధి సాధించామని చెప్పారు. ప్రజలు ఆశీర్వదిస్తే మళ్లీ మీ మధ్యన ఉంటానని, మీకు ఏ విధమైన లోటు లేకుండా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, నాయకులు కోరమోని నర్సింహులు, రాజేశ్వర్‌గౌడ్, కె ఆంజనేయులు, సుధాశ్రీ, రవీందర్‌రెడ్డి, తాటి గణేష్, చెరుకుపల్లి రాజేశ్వర్, రాము పాల్గొన్నారు.

రూ. 25 కోట్లు అదనంగా మంజూరు చేయాలి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం అందజేసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జనవరి 9 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న 300 పడకల ఆసుపత్రికి రూ. 25 కోట్లు అదనంగా మంజూరు చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మను కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం ఆయనను కలిసి మాట్లాడారు. నియోజక వర్గంలో ఖాళీగా ఉన్న పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను నియమించాలని కోరారు. అనంతరం మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

కోడేరు, జనవరి 9 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఈనెల 13వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు గుట్ట యువక బృందం ఆర్గనైజర్లు పి.భానుప్రకాశ్, బి.మహేష్‌లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 12వ తేదీలోపు జూనియర్ కళాశాలలో రూ.500ల ఎంట్రీ ఫీజు కట్టి జట్టు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 13, 14, 15వ తేదీల్లో టోర్నమెంట్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విజేత జట్టుకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి రూ.ఐదు వేలు ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.

పోలీసులతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

జడ్చర్ల, జనవరి 9 : పోలీసులతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన యాలాల భాస్కర్, గత నెల 13న జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలో న్యూసెన్స్ చేస్తుండగా నివారించిన పోలీసులపై అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ కేసులో మంగళవారం యాలాల భాస్కర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గతంలో పోలీసులు ఏర్పాటు చేసిన రోడ్డు స్టాపర్స్‌ను చోరీ చేసిన కేసులో 6నెలలు జైలుశిక్ష అనుభవించాడని తెలిపారు. పబ్లిక్ స్థలాల్లో న్యూసెన్స్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

నా చావుకు కారణం నా భార్య

- వీడియో తీసి పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం

రేవల్లి, జనవరి 9: ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బాల కృష్ణమ్మల పెద్ద కుమారుడు శివకు రాయవరం గ్రామం లింగాల మండలానికి చెందిన శారదతో 13 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. శివ మంగళవారం ఉదయం నా చావుకు కారణం నా భార్యనే అని అతని ఫోన్‌లో వీడియో తీసి రేవల్లి గ్రామ వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. ఈ వీడియో చూసిన కొందరు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న శివ తమ్ముడు రాజు వెంటనే ఇంటికి వెళ్లి గొళ్లెం వేసుకున్న తలుపును బద్దలు కొట్టి శివను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రస్తుతం శివ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై రేవల్లి మండల ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా ఈ విషయం గురించి తనకు సమాచారం లేదని, శివ ఆరోగ్యం కుదుటపడిన తరువాత దీనిపై పూర్తి సమాచారం సేకరిస్తానని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా తన కొడుకును పెళ్లి అయినప్పటి నుంచి అతని భార్య ఎన్నడు గ్రామంలో ఉండనివ్వలేదని, కొన్ని రోజులు పెద్దకొత్తపల్లిలో, కొన్నిరోజులు వనపర్తిలో, నాగర్‌కర్నూల్‌లో ఉన్నారని, చివరికి నా కొడుకును వదిలి హైదరాబాద్ వెళ్లిపోయిందని శివ కుటుంబ సభ్యులు తెలిపారు. ఎవరి దగ్గరకు వెళ్లిన తనకు న్యాయం జరగలేదని మనస్తాపం చెంది నా కొడుకు పురుగుల మందు తాగి ఉంటాడని శివ తల్లిదండ్రులు తెలిపారు.

లేగదూడపై గుర్తు తెలియని జంతువు దాడి



కొత్తపల్లి గట్టు గుండు మధ్య మృతి చెందిన లేగ దూడను పరిశీలిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ నీలయ్య

మాగనూరు, జనవరి 9 : గుర్తు తెలియని జంతువు దాడిలో ఓ లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కర్నిని వెంకటప్ప రోజు మాదిరిగానే సోమవారం రాత్రి పొలం దగ్గర పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా సంవత్సరం వయస్సు ఉన్న లేగ దూడ కనిపించలేదు. చుట్టు పక్కల వెతకగా కొత్తపల్లి గట్టులో రాళ్ల మధ్య మృతి చెందిన దూడను గమనించి ఫారెస్టు బీట్ ఆఫీసర్ నీలయ్యకు సమాచారం అందించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ నీలయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పొలం గట్టుకు దగ్గరగా ఉన్నందున హైనా లేదా ఇతర జంతువు చంపి ఉంటుందని తెలిపారు. స్థానికులు కొందరు చిరుత పులి కోడె దూడను ఎత్తుకొని వెళ్లందని వదంతులు లేపారని, చిరుత పులి యొక్క అడుగు జాడలు కనిపించలేదని తెలిపారు. పంచనామా అనంతరం పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు.

పిండి పవన్ కుమార్‌కు ఎంబీఎస్‌ఐ ఫెలోషిప్ అవార్డు



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 9 : పాలమూరు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్‌కు ఎంబీఐసీ ఫెలోషిప్ అవార్డు దక్కింది. మైక్రోబయాలజీలో ఎన్నో పరిశోధనలు చేసినందుకు గాను మైక్రోబయాలజిస్ట్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎంబీఎస్‌ఐ) ఫెలోషిప్ అవార్డును పాలమూరు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, పీయూ రీసెర్చ్ సెల్ డైరెక్టర్, యంగ్ సైంటిస్ట్ మైక్రోబయాలజీ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్ మంగళవారం అందుకున్నారు. ఇండియాలో మైక్రోబయాలజీ విభాగంలో ఇచ్చే విశిష్ట పురస్కారం, సర్టిఫికెట్‌ను పిండి పవన్ కుమార్ అందుకున్నందుకు గాను పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతామారులు అభినందించారు. ఎంబీఎస్‌ఐ పొందినందుకు ఆయనను కళాశాల డైరెక్టర్ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, మైక్రోబయాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎన్. కిశోర్, డాక్టర్ శాంతిప్రియా, డాక్టర్ మృదుల, పీయూ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేట అర్బన్, జనవరి 9: ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి సుధాకర్, పరమేష్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్, రంగాపూర్ తండాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఆయా చోట్ల 17 లీటర్ల నాటుసారా, 30 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 750 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గ్రామంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న సైదమ్మ, శాంతమ్మ, నిరంజన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అచ్చంపేట సీఐ కృష్ణయ్య వివరించారు. ఎస్సైలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

అమ్రాబాద్, జనవరి 9 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు గ్రామంలో అనారోగ్యానికి గురైన వివాహిత మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అమ్రాబాద్ ఎస్సై వీరబాబు మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం... మన్ననూరు గ్రామానికి చెందిన ఎస్.పోతులకుమార్ అదే గ్రామానికి చెందిన స్వాతి అనే యువతిని మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి సంవత్సరం వయసు కలిగిన బాలిక ఉంది. సోమవారం ఉదయం స్వాతికి ఫిట్స్ రావడంతో స్థానికంగా మన్ననూరు, అచ్చంపేటలో చికిత్స చేయించారు. ఆమె పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో హైదరాబాద్‌లోనే ఒక ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి స్వాతి సోమవారం రాత్రి మృతి చెందిందని ఎస్సై తెలిపారు. తమ కూతురు స్వాతి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని తల్లి పార్వతమ్మ అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య

- పోలీస్ స్టేషన్ ముందు విద్యార్థి బంధువుల ఆందోళన

మద్దూర్, జనవరి 9 : అదృశ్యమైన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం పల్లెర్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. పల్లెర్ల గ్రామానికి చెందిన చెవుళ్ల సురేష్ (16) మద్దూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా గత 7వ తేదీన పని నిమిత్తం మద్దూర్‌కు వెళ్లాడని, తిరిగి ఇంటికి రాకపోవడంతో 8న విద్యార్థి అదృశ్యంపై తల్లి పకీరమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే మంగళవారం సాయంత్రం పల్లెర్ల గ్రామ శివారులోని ఓ చెట్టుకు శవమై వేలాడడాన్ని సమీప పొలానికి చెందిన వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా విద్యార్థి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్దూర్‌లోని ఓ సామాజిక వర్గం అమ్మాయితో మాట్లాడంతో వారి కుటుంబం అవమానంగా భావించి సురేష్‌ను మందలించారన్నారు. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మృతుడి సామాజిక వర్గం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన దిగి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గద్వాల, జనవరి 9 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని అనంతపురం గ్రామానికి చెందిన పెద్ద ఈదన్న(68) కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్ద ఈద్దన్న గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఆదివారం కుటుంబ సభ్యులు ప్రార్థనకు వెళ్లాక, ఇంటి ముందున్న దిమ్మెకు ఉరి వేసుకున్నాడు. గమనించిన చుట్టు పక్కలవారు ఆయనను కాపాడగా, కుటుంబ సభ్యులు కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సంఘటనపై ఆయన కుమారుడు బీచుపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 9 : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనోజ్‌కుమార్, సంజయ్‌శర్మలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. వారు అచ్చంపేటలో నివాసం ఉంటూ ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, గంజాయి తాగే అలవాటు ఉన్నందున జడ్చర్లలో చికెన్ వ్యాపారం చేస్తున్న మహమ్మద్‌హాజీ దగ్గర గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. హాజీని అదుపులోకి తీసుకుని విచారించగా హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముకుంటున్నట్లు విచారణలో పేర్కొన్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు, 50గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఎన్‌ఆర్‌ఐ మృతి



నర్సింహులు(ఫైల్)

మల్దకల్, జనవరి 9: మండల కేంద్రానికి చెందిన దామ శంకరయ్య కుమారుడు, ఎన్‌ఆర్‌ఐ దామ నర్సింహులు (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 20 ఏళ్లుగా లండన్ స్థిరపడిన ఆయన మల్దకల్ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు స్వగ్రామానికి వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్న ఆయన మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

గోపాల్‌పేట, జనవరి 9: ప్రతీ ఒక్క ఇంటికి అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాకల్‌పల్లిలో ఇంటింటికి అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహిస్తున్న సీతారాముడి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా అక్షింతలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రాకాసి అరవింద్‌రెడ్డి, లోంక శేషిరెడ్డి, వేమారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఏసోపు, లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, శేఖర్ రెడ్డి, వడ్ల విష్ణు, బంగారు బాబు, కిట్టు, యాదగిరి రెడ్డి, నరసింహారెడ్డి, నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఖిల్లాఘణపురం, జనవరి 9: ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలకు మండలంలోని మామిడిమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు మంగళవారం కరాటే శిక్షకుడు శివకృష్ణ తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే మహిళల కిక్ బాక్సింగ్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఖేలో ఇండియా మహిళల కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలలో మామిడిమాడ గ్రామానికి చెందిన ఎ.వైష్ణవి, కె.ఐశ్వర్య, కె.వైష్ణవి, యం.దివ్య, కె.భార్గవి, జె.సింధు, సి.నందిని, వి.నిహారికలు మ్యూజికల్ ఫామ్ ఈవెంట్‌లో పోటీ పడతారని తెలిపారు. కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ మోహన్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు రవిశంకర్, విష్ణువర్ధన్ రెడ్డి, పీఈటీ శారద విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 9: ఇటీవల కొందరు వ్యక్తులు తన పేరును వాడుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై ప్రభుత్వ పరమైన చర్యలు తప్పవని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో కొందరు వ్యక్తులు అక్రమ సంపాదనకు అలవాటుపడి తన పేరును వాడుకుంటూ రైస్ మిల్లుల దగ్గర, ఇసుక క్వారీల దగ్గర, వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వ్యాపారుల దగ్గర, మద్యం దుకాణాల దగ్గర అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే అభియోగం వినిపిస్తుందన్నారు. ఎవరైన ఇలాంటి ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

వనపర్తి రూరల్, జనవరి 9: బీఆర్ఎస్ పాలనలో వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వసతి గృహాల్లో వసతులు కల్పించాలని కోరారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని ఏబీవీపీ వనపర్తిశాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వసతి గృహాల్లో ఆన్‌లైన్ విధానాన్ని ఎత్తివేయాలని, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జగదీష్, రమ్య, శివ, నవీన్, కార్తీక్, పరశురాం, సాయిరాం పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్, జనవరి 9: అన్ని తరగతుల హమాలీ కూలీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బేవరేజేస్ హమాలీ యూనియన్ సీఐటీయూ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి మండలంలోని కడుకుంట్ల శివారులలో ఉన్న బేవరేజేస్ లిక్కర్ గోదాం డిపో హమాలీలు 70 మంది సీఐటీయూ అనుబంధ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... అన్ని తరగతుల హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, హమాలీలకు ప్రమాద బీమా కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎం.రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, నాయకులు విజయ్, రవి, కడుకుంట్ల డిపో కార్మికులు రాజు, ప్రభాకర్, రామకృష్ణ, శ్రీను, రామాంజి గౌడ్, సాయి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాలను మెరుగు పరచాలి

పాన్‌గల్, జనవరి 9: విద్యార్థుల్లో బోధన సామర్థ్యాలను మెరుగు పరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం తొలి మెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా విద్యార్థులను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రాధ, సీఆర్పీ గోవిందునాయక్ తదితరులు ఉన్నారు.




విద్యార్థులను చదివిస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూరు, జనవరి 9: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. అమరచింత పట్టణంలోని మార్క్స్ భవనంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు 50వేల మందికి పైగా విధుల్లో ఉన్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను కార్మికుల హక్కులను ఇది వరకు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన కారణంగానే ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించారని గుర్తు చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా కురుమన్న, సహాయ కార్యదర్శిగా చెన్నప్ప, కోశాధికారిగా మల్లేష్, సభ్యులుగా నాగన్నతో పాటు మరో పది మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి హనుమంత్, నాయకులు సామెల్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి కృషి చేసిన ఫాతిమా షేక్ బీబీ

- ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్



ఫాతిమా షేక్ బీబీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీజేఏసీ నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 9: దేశంలో మహిళల విద్యావ్యాప్తికి బీజం వేసిన చదువులమ్మ ఫాతిమా షేక్ బీబీ అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఫాతిమా షేక్ బీబీ జయంతిని టీజేఏసీ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ బీబీ అని, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేతో కలిసి విద్యావ్యాప్తికి కృషి చేశారని అన్నారు. అనంతరం ముస్లిం మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో ఫాతిమా షేక్ బీబీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు గిరిరాజాచారి, నాయికంటి నరసింహశర్మ, మండ్ల దేవన్న నాయుడు, బాలేమియా, డప్పు నాగరాజు, పరమేశ్వరాచారి, మాధవాచారి, సత్యంచారి, శంకర్‌నాయక్, జనార్ధన్‌గౌడ్, లత, శివగంగ, స్వరాజ్యలక్ష్మి, రుబీనా బేగం, సుమేరాబేగం, జీవనజ్యోతి, శ్వేత, బాలీశ్వరి, రాధ, యాస్మీన్ బేగం, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు



తలుపునూరు తండాలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం



తలుపునూరు గ్రామంలో క్రీడా ప్రాంగణం లేకున్నా ఏర్పాటు చేసిన బోర్డు

- **జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు**
- **సగానికి పైగా ఉపయోగం లేనిచోట ఏర్పాటు**
- **వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు**

వనపర్తి అర్బన్, జనవరి 9: గ్రామీణ ప్రాంతాలలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతీ గ్రామంలో ప్రభుత్వ స్థలం గుర్తించి ఉపాధి హామీ నిధులతో అధికారులు ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే దాదాపు అన్ని గ్రామాలలో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేయడం పూర్తి చేశారు. కానీ క్రీడా ప్రాంగణాలలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో యువకులు అటువైపు చూడటం లేదు. కొన్ని గ్రామాల్లో గ్రామానికి దూరంగా.. రాళ్లు రప్పలు ఉన్న ప్రదేశంలో గ్రామీణ క్రీడా ప్రాంగణం అనే బోర్డు ఏర్పాటు చేసి మమ అనిపించారనే ఆరోపణలు వస్తున్నాయి... ఇటీవలే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి సరైన సౌకర్యాలు కల్పించి యువకులకు ఉపయోగపడేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలకు గాను 292 గ్రామ పంచాయతీలలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని ప్రభుత్వ పాఠశాల ఆవరణాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలకు అనుగుణంగా దగ్గర్లోని స్థలాలలో ఏర్పాటు చేశారు. అదే విధంగా క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా ఏర్పాట్లు లేకపోవడంతో క్రీడాకారులు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

వినియోగంలోకి తీసుకురావాలి

గ్రామాలలో ఉన్న క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకురావాలి. క్రీడా ప్రాంగణాల్లో సరైన ఏర్పాట్లు లేవు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీపడే వారికి క్రీడా ప్రాంగణాలలో వసతులు కల్పించాలి. గత ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా యువకులకు ఉపయోగపడే విధంగా క్రీడా ప్రాంగణాలలో సౌకర్యాలు కల్పించాలి.

- చందు, తల్పునూరు గ్రామం



ఇష్టపడి చదివితేనే విజయం

- అడిషనల్ ఎస్పీ రామదాస్ తేజావత్

వనపర్తి రూరల్, జనవరి 9: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే విజయాన్ని సాధిస్తామని అడిషనల్ ఎస్పీ రామదాస్ తేజావత్ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ముందస్తుగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విద్యార్థినులకు స్వామి వివేకానంద పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలని అన్నారు. చదువు ఎంత అవసరమో.. క్రమశిక్షణ కూడా అంతే అవసరమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పోచ రవీందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, రమేష్ అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్వామి వివేకానంద పుస్తకాలు పంపిణీ చేస్తున్న అదనపు ఎస్పీ

చదువుతో పాటు క్రమ శిక్షణ అవసరం

మదనాపురం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని అన్నారు. గణిత మెజీషియన్ చంద్రయ్య విద్యార్థులకు స్పీడ్ గణితం, సులభతర చిట్కాలు, కొన్ని మ్యాజిక్ ప్రదర్శనలు చేశారు. న్యాయవాది అశోక్‌గౌడ్ చట్టాలు, కోర్టులు, న్యాయపరమైన అంశాలు వివరించారు. సైకాలజిస్టు విశ్వనాథం విద్యార్థులకు మూఢనమ్మకాలు, ప్రేరణ తరగతులు నిర్వహించారు. పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ జంగం విశ్వనాథ్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎంఈవో కృష్ణయ్య, హెచ్ఎంలు ఆంజనేయులు, మహేందర్‌గౌడ్, ఎస్ఐ మురళీ పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల
నమోదు ప్రక్రియ వేగవంతం

ఆత్మకూరు, జనవరి 9: ప్రజా పాలనలో ఆయా గ్రామాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆత్మకూరు మండలానికి సంబంధించి 13 గ్రామ పంచాయతీలకు గాను 6,500 పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో 50 శాతం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోపే నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో నమోదు ప్రక్రియను వేగవంతం చేశామని ఆయన తెలిపారు.



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

వర్మి కంపోస్టు తయారీపై శిక్షణ



వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి

మదనాపురం, జనవరి 9 : మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నాబార్డు, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు వర్మి కంపోస్టు తయారీపై రెండు రోజుల పాటు కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి వర్మి కంపోస్టు, సేంద్రియ ఎరువులు, జీవ రసాయన ఎరువుల తయారీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంటలలో వర్మీ కంపోస్టు, జీవ రసాయన ఎరువుల వాడకం గురించి తెలియజేశారు. వాన పాములను పెంచడం, పచ్చిరొట్ట సాగు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ, వర్మి కంపోస్టు ఎరువులను పంటలలో వాడటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు భోగరే, మస్తానయ్య, సురేష్‌కుమార్, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాన్‌గల్, జనవరి 9: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో మంగళవారం గర్భిణులకు డాక్టర్ చిరంజీవి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ ప్రతీ గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 108, 102 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాపీ కార్మికులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

కొత్తకోట, జనవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాపీ కార్మికులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తకోటలో అంబా భవాని తాపీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వెల్ఫేర్ బోర్డుకు నిధులు మంజూరు చేసి కార్మికుల ఉన్నతి కోసం కృషి చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన కార్మికుడికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ ప్రభుత్వంగా ఉండాలని కోరారు. సమావేశంలో హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నిక్సన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పీటీ. శ్రీను, అస్కని శ్రీను, జనార్దన్ సాగర్, సంఘం పట్టణ అధ్యక్షుడు దుప్పలి శ్రీను, కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి నరేష్, శాంతన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



తాపీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

ఖిల్లాఘణపురం, జనవరి 9: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి యుగంధర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రుక్కన్నపల్లి, సోలీపూర్, బోడగట్టుతండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ అధికారి యుగంధర్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఫౌండేషనల్ లిట్రసి అండ్ న్యూమరసీ కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) యూడైస్ ప్లేస్, ఎఫ్ఆర్ఎస్ విద్యార్థుల హాజరును అంతర్జాలంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. ఎఫ్ఎల్ఎన్ అమలులో భాగంగా పాఠ్యాంశాల ప్రణాళిక, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్‌ని మూడింటిని అమరిక చేస్తూ విద్యార్థుల్లో పఠన శక్తిని పెంపొందించాలని అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు వర్క్ బుక్‌లో తప్పులను సరిదిద్దాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు ఆంగ్లం, గణితం విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించాలని అన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా పాఠ్యాంశాలపై ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులతో చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలని, ఎఫ్ఆర్ఎస్‌లో 100 శాతం హాజరు శాతం పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిలో పఠన సామర్థ్యాలను పరీక్షిస్తున్న సెక్టోరియల్ అధికారి

కీడు వార్తలను ప్రజలు నమ్మొద్దు

- లక్ష్మీకాంతాచార్యులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 9: సామాజిక మాధ్యమాల్లో ఇటీవల షేర్ అవుతున్న కీడు వార్తలను ప్రజలు నమ్మొద్దని ధూపదీప నైవేద్య సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ లక్ష్మీకాంతాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు కీడు వచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఒక్క కొడుకు ఉన్న మహిళలు ఇద్దరు అంతకంటే ఎక్కువ కొడుకులు కలిగిన మహిళలతో అప్పు తీసుకుని గాజులు కొనాలని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నట్లు వివరించారు. ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. బూటకపు వార్తలను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అనవసరంగా డబ్బులు వృధా చేసుకోరాదని ఆయన సూచించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రజలు సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మార్చి 18 నుంచి ఎస్ఎస్‌సీ పరీక్షలు

వనపర్తి రూరల్, జనవరి 9: మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకులు గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావునా షెడ్యూల్ ప్రకారం పరీక్షలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చూసుకోవాలని తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపాలని కోరారు.

ఓపెన్ టు ఆల్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు

పాన్‌గల్, జనవరి 9: మండలంలోని కేతెపల్లిలో జూపల్లి యువసేన ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 14,15 తేదీల్లో డే అండ్ నైట్ ఓపెన్ టు ఆల్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ. 50 వేలు, తృతీయ బహుమతిగా రూ. 25వేల నగదు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలను ఈనెల 14న రాష్ట్ర ఎక్సైజ్ అండ్ క్రీడా శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే జట్లు ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటల లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పాన్‌గల్, జనవరి 9 : మండలంలోని దావూద్‌ఖాన్ పల్లిలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సూర్య మోహన్, రమేష్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ. 25,116 షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.15,116 షీల్డ్ అందజేస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్టు సభ్యులు గురువారం ఉదయం లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తకోట, జనవరి 9: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ టీఎస్ క్యాలెండరును ఆ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, నోడల్ ఆఫీసర్ కుర్మయ్య, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర సత్యనారాయణ, నిర్మలాదేవి, లక్ష్మయ్య, సునీల్ కుమార్, శ్రీశైలం, శ్రీదేవి, శివకుమార్, లక్ష్మీనారాయణ గుప్త, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వీపనగండ్ల, జనవరి 9: మండలంలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన మూల కురుమయ్య అనారోగ్యంతో విజయవాడలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జైభీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టీచర్ రాముడు, సిద్దిరవి, నాగముని ధర్మేందర్, కృష్ణ, శ్రీను తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీపనగండ్ల, జనవరి 9: ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హేమవర్దన్, భాగ్యశ్రీ, ప్రియశ్రీ, కరుణ, మంజుల, రాజు, శ్రీను, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.